
సూడో హీరోయిజం

- చూపించేందుకు యువత తహతహ
- విషయం చిన్నదే.. అయినా గొడవలు
- హిల్స్‌లో పెరుగుతున్న దాడులు



స్నేహితుడిని బస్టాపులో వదిలేసి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14కు వచ్చి యువడు సెల్‌ఫోన్ చూసుకోగా స్విచ్ఛాఫ్ అయింది. అక్కడే ఉన్న ఆస్పత్రి వాచ్‌మన్‌ను అడగగా బ్యాలెన్స్ లేదని చెప్పాడు. రెచ్చిపోయిన యువకుడు దాడి చేశాడు. అక్కడే వాచ్‌మన్, అతడి కుమారులు యువకుడిని ఆస్పత్రి సెల్లార్‌కు తీసుకెళ్లి కొట్టారు. కొద్దిసేపటికి యువకుడు మృతిచెందాడు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఇద్దరు కుమారులు, వాచ్‌మన్ జైలు పాలయ్యాడు. ఇదొక్కటే కాదు, ఇలాంటి సంఘటనలు ప్రతీ నిత్యం చోటుచేసుకుంటున్నాయి.

బంజారాహిల్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూత్ అంటే జోష్, సరదాలు, సంతోషాల సంగమం. కాస్త కలివిడిగానూ, ఇంకాస్త హడావుడిగానూ, నిత్యం ఉల్లాసంగానూ ఉండడం వీరి నైజం. రాష్‌గా బైక్ నడపాలన్నా, రేసింగ్‌లతో అందరినీ ఆకట్టుకోవాలన్నా వారికే చెల్లు. కానీ, ఈ సరదాలు, సంతోషాల మాటున చిన్న విషయాలకే గొడవలకు దిగుతున్నారు. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లో యువకుల మధ్య తలెత్తున వివాదాలు చిలికిచిలికి గాలివానగా మారి ఘర్షణలకు దారి తీస్తున్నాయి. ఈ పంచాయతీలు కొన్ని పోలీసుస్టేషన్‌కు చేరుతుండగా, మిగతావి మధ్యవర్తులతో సర్దుకుంటున్నాయి. కాగా, గతేడాది పబ్‌లో తలెత్తిన వివాదంలో బీటెక్ విద్యార్థులు రెండు జట్లుగా విడిపోయి జూబ్లీహిల్స్‌లో బీరు బాటిళ్లతో దాడులకు పాల్పడ్డారు. ఇది జరిగిన కొద్ది రోజులకే మరో పబ్‌లో గొడవ జరిగింది. ఓ అమ్మాయి విషయంలో బంజారాహిల్స్‌లోని ఎంబీఏ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు హాకీ స్టిక్‌లతో పరస్పర దాడులు చేసుకున్నారు. అయితే, పోలీసులు సకాలంలో చేరుకొని ఇరు వర్గాల వారిని అరెస్టు చేశారు.

కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పు లేదు..

చిన్న విషయాలకే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి విషయంలో పోలీసులు ముందు నుంచే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు వీరిని పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తల్లిదండ్రులకు కూడా నచ్చ చెబుతున్నారు. కానీ, యువకులు మాత్రం గొడవల జోలికి వెళ్లడం మానడం లేదు.

గెలుపు కోసం ఆరాటం..

పరిసరాలు, సహచరుల కారణంగా యువత మనస్సు మారుతుంది. కొన్నిసార్లు జన్యుపర మార్పులు ఇందుకు తావిస్తాయి. తల్లిదండ్రుల్లో ఎవరికైనా మద్యం, ఇతర చెడు అలవాట్లు ఉంటే.. ఆ ప్రభావం పిల్లలు యుక్త వయస్సుకు వచ్చిన తర్వాత వారిలోనూ కనిపిస్తుంది. తోటి వారికి ఉన్న దుస్తులు, సెల్‌ఫోన్లు, ఖరీదైన బైక్‌లు, గృహాలంకరణ వస్తువులు తమకూ ఉండాలని వాటిని ఎలాగైనా సాధించాలని తలపోస్తుంటారు. ఈ క్రమంలో అది సాధ్యం కాక.. ఈ వస్తువులున్న వారిపై అసూయ పెంచుకుంటారు. తాము ఓడిపోయామన్న భావన వారిలో కసికి, అసూయకు తావిచ్చే ప్రమాదముంది. ఆదిలోనే తన పరిస్థితి ఏంటో, తాను పెరిగిన వాతావరణం ఏమిటో తెలుసుకుని మసలుకుంటే అంతా బాగానే ఉంటుంది. కానీ, సమీక్ష లేకపోవడంతో సమస్యంతా వస్తుంది. ఈ క్రమంలో చోరీలు, దోపిడీలు చేసి అయినా అనుకున్నది సాధించాలన్న పట్టుదల వారిలో ఉంటుంది. ఒకట్రెండు సార్లు ఇలాంటి పనులు చేసిన తర్వాత.. తమకు తాము ఎక్కువగా ఊహించుకుంటూ మరింతగా రెచ్చిపోయేలా పురిగొల్పుతుంది. హిల్స్ పరిధిలో ఈ మధ్య బీటెక్ చదివిన కుర్రాళ్లు తమ విలాసాల కోసం సెల్‌ఫోన్ దగ్గర నుంచి బంగారు గొలుసుల వరకు స్నాచింగ్ చేయడం మొదలు పెట్టారు. వచ్చిన డబ్బుతో పబ్‌లో గడుపుతున్నారు. ఏడాది కాలంగా చోరీలకు పాల్పడుతున్న బీటెక్ చదువుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు.

అతి స్వేచ్ఛ ముప్పునకు దారి తీస్తోంది

పిల్లలు తరుచూ గొడవలకు దిగుతుండడంతో తల్లిదండ్రులు కౌన్సెలింగ్ కోసం మా దగ్గరికి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో అతిస్వేచ్ఛ ఇలాంటి పరిస్థితులకు దారి తీస్తుందని చాలా కేసుల్లో తేలింది. పిల్లలకు స్వేచ్ఛ కొంతమేరకే ఉండాలి. తప్పు చేశారు అని తెలియగానే దాని పర్యసానం ఎలా ఉంటుంది అనేది తల్లి దండ్రులు పిల్లలకు అర్థం అయ్యేలా చెప్పాలి. అప్పుడు పిల్లలు జాగ్రత్తగా ఉంటారు. చాలామంది తల్లిదండ్రులు ఖరీదైన వాహనాలు కొనిచ్చి ఇక తమ పని అయిపోయిందని భావిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. ఈ వాహనాలతో, స్నేహితులతో కలిసి పిల్లలు ఏం చేస్తున్నారు అనే విషయాన్ని ఎప్పటికప్పుడు గమనించాలి. తప్పటడుగులు పడకుండా మొదట్లో తగిన విధంగా జాగ్రత్తలు వహిస్తే పిల్లలు భవిష్యత్తు మెరుగ్గా ఉంటుంది.

డాక్టర్ సుభాకర్, సైకాలజిస్ట్

ఒకరితో ఒకరు పోల్చుకుని...

యూత్‌లో జలసీకి ప్రధానంగా సెక్సువల్ అట్రాక్షన్ కారణమవుతోందని చెబుతున్నారు క్లీనికల్ సైకాలజిస్టులు. చాలా కేసుల్లో ఇది నిరూపణ అయిందని వివరిస్తున్నారు. అమ్మాయిల విషయమై అబ్బాయిల మధ్య జలసీ విపరీతాలకు తావిస్తోందట. పోష్ ట్రెండీ లుక్స్‌తో ఆకట్టుకోవాలని యువత ఫ్యాషన్లకు పోతుంటే అప్పటి వరకు కలిసి ఉన్న మిత్రులే ఒకరితో ఒకరు పోల్చుకుని అసూయబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో పాకెట్ మనీ పెరిగింది. బైక్ రైడింగ్, సిగరెట్, రాష్ డ్రైవింగ్. మద్యం, డ్రగ్స్ వంటి వాటిని ఫ్యాషన్‌గా అలవాటు చేసుకుంటున్నారు. తాము హీరోలమని ఫీలవుతుంటారు. వీరికి తల్లిదండ్రుల మాటలు చెవినపట్టవు. ఎవరికివారే సూడో హీరోయిజం చూపించాలని అనుకుంటారు. విలువైన సమయం వృథా కావడంతో లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు. కెరీర్, చదువు పాడవుతున్నాయి.

మతసామరస్యానికి ప్రతీక మిలాద్-ఉన్-నబీ

ఎర్రగడ్డ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీక మిలాద్-ఉన్-నబీ అని, ముస్లింలు అన్నిమతాల వారిని పిలిచి వారితో కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. మిలాద్-ఉన్-నబీ వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఫాతిమా నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హఫీజ్ ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విందు భోజనానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు సయ్యద్ నజీర్, షఫీ, మహ్మద్ కాజాపాషా, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ మొహ్మద్ మోసిన్ ఖురేషి, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణకుమార్, నాయకులు బాలరాజు, రాజశేఖర్, రజనీకాంత్, బిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మోదీ నిర్ణయం పత్తి రైతుకు శాపం'

పంజాగుట్ట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాల బెదిరింపు ఒత్తిడికి లొంగి, అమెరికా పత్తిపై 11 శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేసిన ప్రధాని మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నుమాన్ మహ్మద్ అన్నారు. ఆ నిర్ణయం దేశ పత్తి రైతుకు శాపమని ఆయన పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. మోదీ ప్రభుత్వ నిర్ణయంతో ఇక్కడి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. క్వింటాల్ పత్తి ఉత్పత్తికి ఎకరాకు పదివేలకు పైగా ఖర్చు అవుతుండగా కనీస మద్దతు ధర రూ.7,710 నిర్ణయించడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో రైతులు నేరుగా రూ.2,365 నష్టపోతారని అన్నారు. విదేశీ పత్తిపై 11 శాతం దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని, కనీస మద్దతు ధరను పెంచాలని, బలహీన ప్రాంతాలలో రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు రక్షణ ప్యాకేజీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సామాజిక కార్యకర్త భరత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అయాజ్, అమోదీ, యువజన కాంగ్రెస్ నేత ఉమర్ పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్‌లో శిక్షణ

బంజారాహిల్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నైపుణ్యం పెంచేందుకు ప్యూర్ అకాడమీ ముందుకు వచ్చింది. కంప్యూటర్ సైన్స్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12కు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్యూర్ సీఈఓ డాక్టర్ శైలా తల్లూరి మాట్లాడుతూ తమ అకాడమీ ద్వారా వెనకబడిన వర్గాల మహిళలు, యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్టు చెప్పారు. గిరిజన పిల్లల కోసం అభ్యాస బ్రిడ్జ్ స్కూల్స్ ద్వారా విద్యా, పోషక సహాయం అందిస్తున్నట్టు వివరించారు. క్లారానెట్ సీఎస్ఆర్ మద్దతుతో ఈ కార్యక్రమాలు మరింత బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విషయాన్ని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగానే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తమకు స్థలం కేటాయించారని గుర్తు చేశారు. విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ శిక్షణతో పాటు లైఫ్ స్కిల్స్ శిక్షణ కూడా ఇచ్చినట్టు తెలిపారు.

13 నుంచి పికిల్‌బాల్ పోటీలు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర పికిల్‌బాల్ చాంపియన్‌షిప్‌ను ఈనెల 13 నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తున్నారు. బీఎన్‌రెడ్డి కాలనీ, జూబ్లీహిల్స్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ ఫార్మాట్‌లో పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని జమ్మూ కశ్మీర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాల కోసం 9849194841, 9391415084లో సంప్రదించవచ్చు.

పోక్సో కేసులో మూడేళ్లు జైలు శిక్ష

బేగంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అనుచితంగా వ్యవహరించిన కేసులో ఓ వ్యక్తికి మూడు సంవత్సరాల జైలు శిక్షతోపాటు పది వేల జరిమానాను విధిస్తూ కూకట్‌పల్లి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ అండ్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ వివేకానందనగర్‌కు చెందిన లింగంపల్లి అనిల్‌కుమార్(42) 2020లో ఓ బాలిక పట్ల అసభ్యంగా వ్యవహించడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విచారణలో వెలుగు చూసిన వాస్తవాలను పోలీసులు కోర్టులో సమర్పించారు. దీంతో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. పది వేల జరిమానా చెల్లించని యెడల మరో ఆరు నెలలు జైలు శిక్ష విధించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.

సౌండ్ తగ్గించమన్నందుకు దాడి

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధిక సౌండ్ తగ్గించమన్నందుకు కుటుంబసభ్యులపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 7న గణపతి నిమజ్జనం సందర్భంగా జవహర్ నగర్‌లోని వనం నితిన్ కుమార్ ఇంటి సమీపంలోకి రాగానే ర్యాలీగా తరలి వెళ్తున్న వాహనంపై నుంచి గణపతి కింద పడింది. అధిక సౌండ్‌తో ర్యాలీగా వెళ్తున్నారు. సౌండ్ తగ్గించమన్నందుకు దీపక్, రాహుల్, అభిషేక్, సాయి మూకుమ్మడిగా దాడి చేసి నితిన్ కుమార్‌తోపాటు కుంటుబసభ్యులపై దాడి చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెంకటేశ్ చిత్రాలు కళా నైపుణ్యానికి నిదర్శనం



ప్రదర్శనను తిలకిస్తున్న ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, రచయిత్రి మంజు పొద్దార్

హైటెక్ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెన్న వెంకటేష్ కలర్ పెన్సిల్‌తో గీసిన చిత్రాలు తన కళా నైపుణ్యానికి నిదర్శనం అని చెప్ప వచ్చు. 'స్టాక్ స్టోరీస్' దిపొయెటిక్స్ ఆఫ్ అర్బన్ స్టిల్‌నెస్ పేరుతో సోమవారం మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో ప్రదర్శనకు ఉంచారు. ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ ఐఏఎస్ కె.లక్ష్మి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణరెడ్డి, రచయిత్రి మంజుపొద్దార్, రాజేందర్ నాగుల, సుభాష్‌బాబు హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం హరిపిరాల గ్రామానికి చెందిన ఎంఎఫ్ఏ విద్యార్థి వెంకటేష్ సహజత్వం ఉట్టిపడేలా కలర్ పెన్సిల్‌తో మేడారం జాతర, బేగంబజార్‌లో దొరికే వస్తువులు, చెత్త డంపింగ్ యార్డు, బైక్‌పై కుటుంబసభ్యులు వెళ్లే తీరును అద్భుతంగా మలిచాడు. 14 వరకు పెయింటింగ్ ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 వరకు ఉంటుందని ఆర్టిస్ట్ వెంకటేష్ చెప్పారు.

భాగవత శ్రవణం సకల శుభదాయకం

బంజారాహిల్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భక్తితో భాగవతాన్ని ఏడు రోజులు వింటే అనేక శుభాలు కలుగుతాయని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సముద్రాల శఠగోపాచార్యులు పేర్కొన్నారు. షేక్‌పేట సాయిబాబా మందిరంలో సోమవారం సాయిబాబా ఆలయంలో భాగవత సప్తాహ ప్రవచనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవన విధానం, గాడి తప్పితే తలెత్తే ఇబ్బందుల గురించి భాగవతం స్పష్టంగా వివరిస్తుందన్నారు. అనంతరం దేవులపల్లి వరప్రసాదరావు పోతన భాగవతన పద్యాలను రాగయుక్తం ఆలపించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ కార్యదర్శి అశోక్ కుమార్, సభ్యులు శ్రీనివాసులు, అర్చకులు రాఘరాచార్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

పంజాగుట్ట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి రాపర్తి అశోక్ అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ సర్కిల్-19 కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో పారిశుద్ధ్య విభాగం ఇన్‌చార్జి శానిటరీ సూపర్‌వైజర్ గోపాలకృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి.నాగేష్, ఎండీ ఆసిఫ్, సుగుణమ్మ, యల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బేగంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రభుత్వం అందిస్తుందని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ అన్నారు. బేగంపేటలోని పాటిగడ్డకు చెందిన ఇరువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ అనుమతి పత్రాలను ఆయన విశాల్ సుధాంతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నాగార్జునరెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలి

వెంగళరావునగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వ్యాపారవేత్త దేవిరెడ్డి నాగార్జునరెడ్డికి టికెట్ ఇస్తే ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని వెంగళరావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అన్నారు. సోమవారం మధురానగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. డివిజన్ మాజీ అధ్యక్షుడు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించాలని సూచించారు. సమావేశంలో నాయకులు చిలకల వెంకటేశ్వరరావు, హనుమంతరావు యాదవ్, సోమ పటేల్, కె.రాజశేఖర్, రేఖ, అశోక్, రవి కుమార్, జయశ్రీ, వెంకట్రామిరెడ్డి, గురుమూర్తి, ఉపేందర్‌రెడ్డి, షేక్ సుల్తానా, మల్లికార్జున్, చారి, రాంచందర్, మహబూబ్, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో బాలికపై లైంగిక దాడి

- యువకుడి అరెస్ట్

బంజారాహిల్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో బాలికపై లైంగిక దాడి చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేపాల్‌కు చెందిన బాలిక(13) జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ పరిధిలో తల్లిదండ్రులతో కలిసి నివాసముంటుంది. పదవతరగతి చదువుతున్న బాలిక ప్రతీ రోజు పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో న్యూడిల్స్ దుకాణం ముందు ఆగేది. అక్కడే పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన కృష్ణతో పరిచయం ఏర్పడింది. కృష్ణ బాలికను మాటల్లోకి దించి ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అతడి మాట విన్న బాలిక ఇంట్లో ఎవరికి చెప్పకుండా అతడి వద్దకు వచ్చేసింది. న్యూడిల్స్ దుకాణంలో ఆమెతో రెండు రోజులపాటు కాపురం చేసి నేపాల్‌కు పారిపోవాలని కృష్ణ పతకం వేశాడు. కుమార్తె కనిపించకపోవడంతో తల్లిదండ్రులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి 24 గంటల్లోనే బాలిక న్యూడిల్స్ దుకాణంలో ఉన్నట్టు గుర్తించారు. బాలికను ప్రశ్నించగా లైంగిక దాడి జరిగినట్టు నిర్ధారణ అయింది. ఆమెను భరోసా కేంద్రానికి తరలించారు. కృష్ణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆటో వెనకాల ఉన్న పేరు దొంగను పట్టించింది

- వాట్సాప్‌లో పెట్టిన రెండు గంటలకే వివరాలు



ఆటో వెనకభాగంలో ఉన్న పేరు

బంజారాహిల్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరానికి వలస వచ్చిన జార్ఖండ్‌కు చెందిన వారంతా యోగక్షేమాలు తెలుసుకునేందుకు ఓ వాట్సాప్ గ్రూప్ పెట్టుకున్నారు. ఇదే గ్రూప్‌లో ఉన్న జార్ఖండ్‌కు చెందిన యువకుడి ఆటో చోరీకి గురైంది. ఇదే విషయాన్ని వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఇది జరిగిన రెండు గంటల్లోనే ఆటో వెనకాల ఉన్న పేరును బట్టి వాట్సాప్‌లో ఉన్న మరో సభ్యుడు గుర్తించాడు. అడ్రస్‌తో సహా ఆటో ఎక్కడ ఉంది అనేది పోస్టు చేయడంతో కొంత మంది యువకులు ఆటోతోపాటు చోరుడిని కూడా పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

జార్ఖండ్‌కు చెందిన బిపిన్ రాజ్‌యాదవ్ మూడు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి బొల్లారంలోని ఓ గదిలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఆటోను నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 7న సవారీ అయిపోయాక ఆటోను ప్రతీ రోజు పెట్టే వద్ద పార్కింగ్‌లో ఉంచి తాళం వేసుకొని గదికి వెళ్లిపోయాడు. తెల్లవారుజామున ఆటో తీసేందుకు పార్కింగ్ ప్రాంతానికి రాగా వాహనం కనిపించలేదు. స్నేహితులను అప్రమత్తం చేయడంతోపాటు అన్నిచోట్లా వెతికాడు. ఇదే విషయాన్ని బిపిన్‌తోపాటు ఉండే ఓ యువకుడు జార్ఖండ్ ఎక్తా మండల్ అనే వాట్సాప్ గ్రూప్‌లో పెట్టాడు. ఆటో వెనకాల బిపిన్ రాజ్‌యాదవ్ అనే పేరు ఉంటుందని ఎక్కడైనా కనిపిస్తే ఆచూకీ చెప్పాలని కోరాడు. పోస్టు చేసిన రెండు గంటల అనంతరం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10 స్టార్ ఆస్పత్రి పక్క వీధిలో ఆటో ఉండడాన్ని జార్ఖండ్‌కు చెందిన కల్లురాం చూశాడు. అయితే, ఆటో వెనకాల బిపిన్ అని మాత్రమే ఉంది. రాజ్‌యాదవ్ అనే స్టిక్కర్ తొలగించినట్టు గుర్తించాడు. వెంటనే ఆటో వెనక బాగాన్ని ఫొటో తీసి వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేశాడు. అంతే గాకుండా ఆటో ఉన్న లోకేషన్‌ను పెట్టాడు. అప్రమత్తమైన బిపిన్ తదితరులు బంజారాహిల్స్‌కు వచ్చారు. నేరుగా ఆటో వద్దకు వెళ్లి అందులో డ్రైవర్ సీటులో దర్జాగా కూర్చున్న వ్యక్తిని పట్టుకున్నారు. ఆటో తనదేనంటూ వ్యక్తి బుకాయించేందుకు ప్రయత్నించాడు. యువకులంతా కలిసి అతడిని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. చోరీ బొల్లారం పోలీసుస్టేషన్ పరిధిలో జరగడంతో బంజారాహిల్స్ పోలీసులు అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కల్లురాం సమయస్ఫూర్తిని అందరూ అభినందించారు. మొత్తానికి ఆటో వెనకాల ఉన్న పేరు, వాట్సాప్ గ్రూప్ ఆటోను రెండు గంటల్లో తిరిగి పట్టించిందన్నమాట.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఎర్రగడ్డ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2023 ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి సోమవారం వినతిపత్రాన్ని పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలం, గుర్తింపుకార్డు, రూ.25 వేలు పెన్షన్, రూ.10 వేల కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు తదితర హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇంద్రన్న, వీరస్వామి, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి నియోజకవర్గం కన్వీనర్లు బ్యాగరి చంద్రశేఖర్, సిహెచ్ నర్సింగరావు, జూబ్లీహిల్ కో-కన్వీనర్ ఎస్.సెబాస్టియన్, మహిళ కో కన్వీనర్ పద్మ యాదవ్, హైదరాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.మాణిక్యం, మోహన్‌చారి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమిటీ సభ్యులు రజక నరసింహన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీలత, సతీష్‌గౌడ్, సురేందర్ గౌడ్, వినోద్ కుమార్, ముత్యాల యాదగిరి, కటకం సురేందర్, ఆంజనేయులు, ముస్తఫా మొహ్మద్ పాల్గొన్నారు.



రాహుల్‌గాంధీకి వినతిపత్రాన్ని పోస్టు చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఎర్రగడ్డ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలు కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ తెలంగాణ పూర్వవైభవం రావాలన్న ఆశతో ఉన్నారని గుర్తు చేశారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క హామీ నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. ఇవన్నీ కూడా ప్రజలకు వివరించాలని తెలిపారు. సమావేశంలో కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, మహేశ్వరి, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, తూము శ్రవణ్ కుమార్, ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు సంజీవ్, ప్రధాన కార్యదర్శి షరీఫ్ కురేషి, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు అజీముద్దీన్, సయ్యద్ రసూల్, కళ్యాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

మేరి జన్మదిన వేడుకలు





ఖైరతాబాద్‌లోని ఆరోగ్య మాత చర్చిలో యేసుక్రీస్తు తల్లి మేరి జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్రైస్తవ సమాజంతోపాటు ఇతర మతాల వారు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



తెలంగాణ ఉద్యమకారుడు విలియంకు నివాళులర్పిస్తున్న పలువురు ప్రముఖులు

తెలంగాణ ఉద్యమకారుడికి నివాళులు

తిరుమలగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుడు విలియం ఆదివారం అనారోగ్యంతో బొల్లారంలోని ఆయన నివాసంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాటి మలిదశ ఉద్యమకారులు ఆయన నివాసానికి వచ్చి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రకాశ్ మాట్లాడుతూ 1969 ఉద్యమ కాలం నుంచి మలిదశ వరకు అలు పెరుగని ఉద్యమకారుడిగా విలియం జీవితం కొనసాగిందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా తన వ్యక్తి గత జీవితాన్ని, కుటుంబాన్ని వదిలి ఉద్యమ కోసం వ్యక్తిగతంగా కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు. ఉద్యమకారులు రాందాస్, నంది నిర్మల, మురుగేష్, అల్వాల్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ జీవకన్, స్థానికులు పుట్నాల కృష్ణ, మంద శోభన్‌బాబు, దయాకర్, సురేందర్ రెడ్డి, అశోక్ కుమార్, సుధీర్, సంతోష్, వెంకటేష్, నరేష్, ముత్యాలు, చంద్రశేఖర్, యాదగిరి, నర్సింగ్‌రావు, మహేందర్, అంజనేయులు గణేష్, శ్యాంకుమార్‌లు నివాళులర్పించారు.

సైకిల్‌పై తిరుపతి యాత్ర



వెంకటేశ్వరరావు

చిలకలగూడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇష్ట దైవమైన తిరుపతి వెంకటేశ్వరస్వామిని దర్శించటానికి సైకిల్‌పై తిరుపతి చేరుకుని, నడక మార్గాన వెళ్లి స్వామిని దర్శించుకున్నారు అల్వాల్ నివాసి వెంకటేశ్వరరావు. అయన దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ రైల్ నిలయం, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ విభాగంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అల్వాల్ నుంచి జడ్చర్ల, కర్నూల్, ఒంటిమిట్ట గుండా రోజుకి దాదాపు 100 కిలోమీటర్ల చొప్పున సైకిల్ తొక్కుతూ ఐదు రోజుల్లో తిరుపతి చేరుకున్నానని తెలిపారు. ఈ ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, గతంలో 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉమ్నాబాద్, మణిక్‌ప్రభు దత్తాత్రేయ ఆలయానికి వెళ్లానని ఆంధ్రజ్యోతికి తెలిపాడు. సైకిల్ తొక్కడం వల్ల శారీరక శ్రమ, మంచి వ్యాయామని, రోజు సైకిల్ తొక్కుతానని, క్రీడలంటే కూడా ఇష్టమని ఆయన తెలిపాడు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కార్తీకారెడ్డి



బండ కార్తీకారెడ్డి

తార్నాక, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకా రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తెలంగాణ రాష్ట్ర బీజేపీ పూర్తి స్థాయి కమిటీని ప్రకటించారు. అందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ నుంచి తార్నాక ప్రాంతానికి చెందిన బండ కార్తీకా రెడ్డికి ఉపాధ్యక్షురాలుగా అవకాశం కల్పించారు. పార్టీని నమ్ముకుని అంకితాభావంతో పనిచేస్తున్న ఆమె సేవలను జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు గుర్తించి సముచిత స్థానం కల్పించడం పట్ల బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.



బోయినపల్లిలోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు విస్తరిస్తాం : మల్లారెడ్డి

బోయినపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా మల్లారెడ్డి విద్యా సంస్థలు ఏర్పాటు చేసి మంచి విద్యను అందించనున్నట్లు మేడ్చల్ శాసన సభ్యులు, మాజీమంత్రి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన అందుబాటులో ఉండటం లేదు. దాంతో ఆయన అభిమానులు సోమవారం బోయినపల్లిలోని అయన నివాసంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన కీలక నాయకులు మల్లారెడ్డిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అనేక విద్యా సంస్థలను నెలకొల్పి ప్రపంచంలోనే నైపుణ్యతతో కూడిన యువతను తయారు చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజులలో దేశంలో లక్నో, వైజాగ్, కలకత్తా, ప్రాంతాల్లో విశ్వవిద్యాలయాలు నెలకొల్పి మరింత విస్తరింపజేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు వెల్లడించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన జెమ్స్ స్ట్రీట్ రైల్వేస్టేషన్ వద్ద జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం జెమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాల వద్ద గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరం వల్లే రిజర్వాయర్లలోకి నీళ్లు : బీఆర్‌ఎస్

ముషీరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం వల్లే రిజర్వాయర్లలో నీటిని నింపి ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం నీటితో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువులను నింపేందుకు శంకుస్థాపన చేయడంతో కేసీఆర్ కట్టిన కాళేశ్వరం వల్లే అని హర్షం వ్యక్తం చేస్తూ కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం చేశారు. ఇప్పటికైనా కాళేశ్వరం పై తప్పుడు ప్రచారం మానుకుని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, నర్సింగ్‌రావు, పార్టీ నాయకులు జావేద్‌ఖాన్, ప్రవీణ్, మనోహర్, కె.ఎం సాయి, ఆజాపాషా, సైఫొద్దీన్, సుమన్, శివ పాల్గొన్నారు.



సీఎంఆర్ అనుమతి పత్రాలను అందజేస్తున్న సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ, విశాల్ సుధాం

అర్హులకు సంక్షేమ పథకాలు : డా. కోట నీలిమ

బేగంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రభుత్వం అందిస్తుందని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా. కోట నీలిమ అన్నారు. బేగంపేటలోని పాటిగడ్డకు చెందిన ఇరువురికి మంజూరైన సీఎంఆర్ అనుమతి పత్రాలను కోటనీలిమ, విశాల్ సుధాంలు అందజేశారు. పాటిగడ్డకు చెందిన మంగమ్మ, మహేష్ అను ఇరువురికి మంజూరైన రూ.37,500, 60,000 విలువ గల సీఎంఆర్ అనుమతి పత్రాలు మంజూరవడంతో నీలిమ వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు



సీతాఫల్ మండిలో తెరుచుకున్న రామాలింగేశ్వర స్వామి ఆలయం

లష్కర్‌లో తెరుచుకున్న ఆలయాలు

యథావిధిగా పూజలు

సికింద్రాబాద్, రెజిమెంటల్ బజార్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం వీడడంతో సంప్రోక్షణ అనంతరం లష్కర్‌లోని దేవాలయాలు తిరిగి తెరుచుకున్నాయి. ఎప్పటి మాదిరిగా పూజారుల మంత్రోచ్చారణల నడుమ భక్తులు పూజలు జరిపారు. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహాకాళి ఆలయం, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రోడ్డులోని గణపతి దేవస్థానం, రెజిమెంటల్‌బజార్‌లోని సంతోషిమాత దేవాలయం, మారేడుపల్లిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, తాడ్‌బండ్ వీరాంజనేయస్వామి దేవస్థానం సోమవారం ఉదయం తెరుచుకున్నాయి. పరిసరాల భక్తులు ఆలయాలను సందర్శించి, పూజలు జరిపారు.

తిరుమలగిరిలో..

సోమవారం ఉదయం బొల్లారం డౌటన్ బజార్‌లోని హనుమాన్ దేవాలయం, కుటియ టెంపుల్, లాల్‌బజార్‌లోని మహంకాళి ఆలయం, తోట ముత్యాలమ్మ ఆలయం ఉదయం 6 గంటలకు తెరిచారు. సంప్రోక్షణ చేసి అభిషేకాలు, అర్చన చేసి భక్తులకు అందుబాటులో ఉంచారు. ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు దైవ కైయింకర్యాలు నిర్వహించారు.



సికింద్రాబాద్ గణపతి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు

బౌద్ధనగర్‌లో

చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో పలు ప్రాంతాల్లో మూసివేసిన ఆలయాలు సోమవారం ఉదయం యధావిధిగా తెరుచుకున్నాయి. అలాగే నామాలగుండులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయం, సీతాఫల్‌మండి రామాలింగేశ్వరస్వామి ఆలయం, బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం, చిలకలగూడలోని కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేసి సోమవారం ఉదయం ఎనిమిది గంటల తర్వాత ఆలయాలను శుద్ధి చేసి, సంప్రోక్షణ అనంతరం యధావిధిగా పూజలను నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికే కంటోన్మెంట్ వాణి : ఎమ్మెల్యే శ్రీగణేష్



కంటోన్మెంట్ వాణి జరుగనున్న బోయినపల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, జంపన ప్రతాప్ తదితరులు

సికింద్రాబాద్, బోయినపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కంటోన్మెంట్ వాణి పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు వస్తాయని, ఇది సమస్యల పరిష్కార వేదిక కానుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి మాదిరిగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 'కంటోన్మెంట్ వాణి' కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇటీవల నిర్ణయించారు. ప్రతినెలా 10వ తేదీన కంటోన్మెంట్ వాణిని ఒక్కో నెల ఒక్కో వార్డులో ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. దీనిలో భాగంగా ఈనెల 10వ తేదీన బోయినపల్లిలోని కంటోన్మెంట్ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించాలని నిర్ణయించిన శ్రీగణేష్ సోమవారం కంటోన్మెంట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, టీపీసీసీ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్, నాయకులు ముప్పిడి మధుకర్, బద్దం బల్వంత్‌రెడ్డి, అయూబ్‌ఖాన్, ముప్పిడి మధుకర్ తదితరులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటోన్మెంట్ వాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఇంజనీరింగ్, పోలీస్, రెవెన్యు ఎలక్ట్రిసిటీ, హెల్త్ డిపార్ట్‌మెంట్స్ అధికారులు, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ, కంటోన్మెంట్ బోర్డులోని అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఒకే వేదికపై అధికారులందరూ అందుబాటులో ఉంటారు కాబట్టి వీలైనన్ని సమస్యలు అప్పటికప్పుడే పరిష్కారమవుతాయని తెలిపారు.

ఇలాంటి పరిష్కార వేదికను ప్రజలందరూ ఉపయోగించుకుని వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం సులువు అవుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మారుతీ గౌడ్, సామ్యూల్ వేణుగోపాల్ రెడ్డి, సంకి రవీందర్, నాగినేని సరితా, సంతోష్, ముఖేష్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫిజియోథెరపీ దినోత్సవం

● 2030నాటికి పెరగనున్న అధిక వయస్కులు



ఫిజియోథెరపీ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఫిజియోథెరపిస్టులు

రాంగోపాల్‌పేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తులో అధిక వయసు గల వారి సంఖ్య పెరగనున్నదని కిమ్స్ రిహాబిలిటేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సదీంద్ర పూటూరి అన్నారు. అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కిమ్స్ ఆస్పత్రిలో ఫిజియోథెరపీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి ప్రపంచంలో 60 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు కలిగిన వారు సుమారు 1.4 బిలియన్ మందిగా, 2050 నాటికి ఇది 2.1 బిలియన్‌కు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ఎక్కువమంది ఎక్కువ కాలం జీవించే పరిస్థితిలో వృద్ధుల్లో చలనం, బలం, శ్రేయస్సు కలిగించేందుకు ఫిజియోథెరపీ వంటి మద్దతు వ్యవస్థలు ఎంతో అవసరమన్నారు. ఈ సంవత్సరం ఆరోగ్యంగా వృద్ధాప్యంలోకి ప్రవేశించడం అనే అంశంపై దృష్టి పెట్టామని, ఇందులో ముఖ్యంగా బలహీనత, పడిపోవడం, నివారించడంపై అవగాహన కల్పించారు. కిమ్స్ ఆస్పత్రి వైద్య విద్య డైరెక్టర్లు డాక్టర్ మణిమాలారావు, డాక్టర్ రాజగోపాల్‌లు సదస్సులో మాట్లాడుతూ వయస్సు పెరిగినా బలం, సమతుల్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, జీవితాన్ని సంపూర్ణంగా జీవించేందుకు ఫిజియోథెరపీ తోడ్పడుతుందని వివరించారు. కార్యక్రమంలో సుమారు 200 మంది ఫిజియోథెరపిస్టులు, సహాయ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐ లింక్‌తో ఓయూ భాగస్వామ్యం

● ఏఐ, ఎంఎల్ అండ్ డేటా అనలిటిక్స్ నైపుణ్యాల అభివృద్ధికి ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న ఓయూ, ఏఐ లింక్ సంస్థ బృందాలు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల (యూసీఈ) విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంల్), డేటా అనలిటిక్స్ రంగాలలో నైపుణ్యాల అభివృద్ధి కోసం ప్రముఖ టెక్నాలజీ సంస్థ ఏఐ లింక్ టెక్నాలజీస్‌తో ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్ కోర్సులు, హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్‌లు, ప్రాక్టికల్ ట్రైనింగ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఈ భాగస్వామ్యం విద్యార్థులను గ్లోబల్ స్థాయిలో పోటీపడే నైపుణ్యాలతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏర్పాటైంది. కార్యక్రమాన్ని ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం సోమవారం ప్రారంభించారు. "విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే దిశగా, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉన్న నైపుణ్యాలను అందించడమే లక్ష్యం" అని అన్నారు. ఏఐ లింక్ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ భాగస్వామ్యంతో పరిశ్రమ-అకడమిక్ సంబంధాలను బలోపేతం చేస్తుందని, ఓయూ టెక్నాలజీ కేంద్రంగా ఎదుగుతున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు వాస్తవ అనువర్తనాలపై అవగాహన కల్పించి, పరిశ్రమ అవసరాలకు తగిన నైపుణ్యాలతో వారిని సిద్ధం చేయడమే తమ లక్ష్యం అని ఏఐ లింక్ సంస్థ డైరెక్టర్ సందీప్ వోలాం పేర్కొన్నారు. కార్యక్రమంలో యూసీఈ వైస్-ప్రిన్సిపాల్ బి.మంగు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ మల్లేశం, ఏఐ లింక్ సంస్థ సభ్యులు శుభం లాల్, పూర్వ శ్రీవాత్సవ, ప్రొఫెసర్ శివ రామకృష్ణ, ప్రొఫెసర్ డి.రామకృష్ణ, డి.దివాకర్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

● యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకుల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు ఒక సమావేశంలో చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని రాష్ట్రంలోని 12 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో అధ్యాపకులను నియమిస్తున్నారని, ఇది సరైంది కాదని, వారి నియామకాలను రద్దు చేసి శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని ఆయన చేసిన వ్యాఖ్యలు తమను ఎంతో బాధించాయని వాపోయారు. 30 ఏండ్లుగా తాము యూనివర్సిటీల మనుగడను కాపాడుతున్నామని పేర్కొన్నారు. 2017 ఫిబ్రవరి 9న జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో అప్పటి బీజేపీ ఎమ్మెల్యే జి.కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ రామచందర్ రావు కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు న్యాయమైనవని గుర్తించి పూర్తి మద్దతు ప్రకటించారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో జరిగిన నిరవధిక సమ్మెలకు బీజేపీ నుంచి ఎమ్మెల్యే పాయల్ శంకర్, కాసం వెంకటేశ్వర్లు తదితరులు మద్దతుగా నిలిచారని తెలిపారు. మరి ఇప్పుడు ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

యువతి అదృశ్యం



మీనాక్షి

మల్కాజిగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వసంతపురి కాలనీకి చెందిన మునిగల మీనాక్షి (30) సోమవారం ఉదయం ఇంటి ముందు వాకింగ్ చేస్తూ ఉంది. కొద్దిసేపటికి చూసేసరికి ఆమె కన్పించలేదు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో అనుమానంతో ఆమె తల్లి అలివేలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నతులుగా తీర్చిదిద్దేవారే గురువులు



ఉపాధ్యాయులను సన్మానించిన రాజపేట చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఆర్.అంజనేయులు

ముషీరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేవారే గురువులని రాజపేట చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఆర్.అంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో టీచర్స్ డేను పురస్కరించుకుని రాజపేట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం, బహుమతుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.అంజనేయులు మాట్లాడుతూ... చిన్ననాటి నుంచే పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ ఉన్నత స్థాయిలో ఉండేలా ఉపాధ్యాయులు ఎంతో కృషిచేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల వల్లే విద్యార్థులు దేశ, విదేశాలలో వివిధ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, విద్యామండలి డిప్యూటీ ఐవోఓస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పద్మావతి, రఘునందన్, కొండల్‌రెడ్డి, సహనాకౌసర్, ఉషా, అబ్దుల్లా, సునిత తదితరులు పాల్గొన్నారు.

కేబుల్స్ కట్ .. పనిచేయని సీసీ కెమెరాలు

● అందుబాటులోకి తెస్తాం : ఇన్‌స్పెక్టర్ అనుదీప్



సీసీ కెమెరాల కేబుల్స్‌ను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ అనుదీప్

బౌద్ధనగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సందర్భంగా చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాల కేబుల్స్ దెబ్బతిన్నాయి. విగ్రహాలను తరలించేటప్పుడు చాలా చోట్ల కేబుల్స్ కట్ కావటంతో సీసీ కెమెరాలు పనిచేయలేదు. సోమవారం చిలకలగూడలో కట్ అయిన సీసీ కెమెరాల కేబుల్స్‌ను ఇన్‌స్పెక్టర్ అనుదీప్ పరిశీలించారు. కేబుల్స్ దెబ్బతినడం వల్ల పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలు పనిచేయటం లేదని ఆయన తెలిపారు. కేబుల్స్‌కు మరమ్మతులు చేపట్టి మరలా సీసీ కెమెరాలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.



మెట్టుగూడలో విలేకరులతో మాట్లాడుతున్న రాజేశ్వరి

ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికలు వాయిదా

సికింద్రాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓటమి భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేస్తోందని బీజేపీ రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి విమర్శించారు. మెట్టుగూడలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విసుగు కలిగిందని, తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ఓటమి ఖాయమని తెలడంతో బీసీ రిజర్వేషన్ ముసుగులో కాంగ్రెస్ దొంగ నాటకాలు ఆడుతోందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు రాకుండా బీజేపీ రాష్ట్ర నాయకులు అడ్డుకుంటున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, సీతక్క, కొండా సురేఖలు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని ఆమె అన్నారు.



అధ్యాపకులను సత్కరించిన టి.ఎన్.శ్రీనివాస్ తదితరులు

గురువుల సేవలు అపారం

సికింద్రాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజాభ్యున్నతికి గురువులు చేస్తున్న సేవలు అపారమని బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని గన్‌బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులను టి.ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కుమార్ ముదిరాజ్, దేవులపల్లి శ్రీనివాస్, శ్యామ్‌రెడ్డి, వాహబ్, అమీర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులైన నగర మాజీ మేయర్ బండకార్తీకరెడ్డిని సత్కరిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్.
- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి



అభినందన

గణేష్ నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించినందుకు బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతిరాజు, డీఐ సర్దార్ నాయక్, ఎస్సైలను రాణా ప్రతాప్ యువసేన ప్రతినిధులు రాముగౌడ్, దయానంద్, గోపి, జంపన రవి, వేణు, నాగరాజు, అనిల్‌లు సోమవారం సత్కరించారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి